కిష్కింధ కాండ

— వీరప్లవే వీణావాణి



అది... ఓ యూనివర్శిటీ. దాని పేరు 'కిష్కింధా యూనివర్శిటీ' ఆ యూనివర్శిటీ ఆవరణం మధ్యభాగంలో అధునాతనంగా నిర్మింపబడ్డ అందమైన ఆడిటోరియం వుంది. దానిపేరు 'గంథమాదనా ఆడిటోరియం' దానికి కొంచెం పడమటి వేపున ఓ పెద్ద భవనం వుంది. అదే 'రుష్యమూకా ఆర్ట్సు బ్లాక్'

అదే బ్లాక్‌లోకి ప్రవేశించి కుడివేపుకు తిరిగితే తెలుగు డిపార్ట్‌మెంట్ అగుపిస్తుంది. అందులో పదిహేను గదులున్నాయి. ప్రొఫెసర్లూ, రీడర్లూ, లెక్చరర్లూ ఆ గదుల్లో కూర్చుని కిచకిచలాడుతుంటే.ఎం.ఎ. చదివే విద్యార్థులూ, రీసెర్చిస్కాలర్లూ అక్కడే వరండాలో చేరి యాక్టివ్‌గా కుప్పిగంతులు వేస్తుంటారు.

ఉదయం సరిగ్గా పదిగంటలు. ఆ తెలుగు డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన సీనియర్ ప్రొఫెసర్ సుగ్రీవరావు గారు ఉన్నట్టుండి 'అయ్యో అమ్మో' అంటూ భీకరంగా కేకలు వేస్తూ తన గదిలోంచి గెంతుకుంటూ వరండాలోకి వచ్చారు.

ఆయన గొంతు విని అది యూనివర్శిటీ సైరన్ అనుకుని మొదట మిస్‌లీడైపోయి చివరికది సుగ్రీవరావు గారి గాత్రమని గమనించిన ప్రొఫెసర్ జాంబవంతరావు, సీనియర్ రీడర్ శ్రీమతి అంజనాదేవి, లెక్చరర్ అంగద్‌గారు మరికొంత మంది తమ తమ గదుల్లోంచి వరండాలోకి వచ్చేశారు.

"వాట్ హేపెండ్ సార్?"

తన చుట్టూ మూగిన స్టాఫ్ మెంబర్లూ, మరి కొందరు విద్యార్థులూ ఆందోళనతో అలా అడుగుతూ వుంటే...అవేమీ పట్టించుకోకుండా, తన పొడవైన తోకను రెండు చేతుల్తో పట్టుకుని కన్నీరు పెట్టుకుంటూ సుగ్రీవరావు గారు కంటిమ్యాగా గెంతులేస్తున్నారు.

యింతలో హఠాత్తుగా సుగ్రీవరావు గారు రెండు చేతులతో పట్టుకున్న తన తోక చివరి భాగం మీద ఉఫ్ ఉఫ్ మని నోటితో గాలిని ఊదుకోసాగారు. తమ ప్రొఫెసర్ గారి ముద్దుల తోకకేదో ప్రమాదం ముంచుకొచ్చిందని గ్రహించడానికి ఆ వరండాలో మూగిన మూకకు మూడు క్షణాలు పట్టింది.

"జాంబవంతరావు గారూ! చాలా ఘోరం జరిగిపోయిందయ్యా! నా ముద్దుల తోక మీద... తోక మీద..." అంటూ సుగ్రీవరావు ఆయాసంతో చెప్పలేక పోయాడు.

"చెప్పండి సార్! మీ విలువైన తోక మీద... ఆ ఎకనమిక్స్ డిపార్ట్‌మెంట్ వెధవలు సెనేట్ హాల్లో సెమినార్ కండక్ట్ చేసి విమర్శల్లాంటివి గానీ విసిరారా?" ఆతృతగా అడిగాడు జాంబవంతరావు.

"అది కాదయ్యా! నా తోక మీద... ఓ తేలు కాటువేసి పోయింది. విషం మెల్లగా తోక వెంబడి ఒంట్లోకి ఎక్కుతున్నట్టుగా వుంది. తోకంతా సలుపుతూ వుంది. అబ్బా! అమ్మా! నొప్పి" అంటూ సుగ్రీవరావు విలవిలలాడి పోసాగాడు.

"మీ తోక మీద యిలా కాటెయ్యడానికి ఆ తేలుకు ఎన్ని కొండెలు సార్? నా తోకతో యివాళ దాని అంతుచూస్తాను. ఎక్కడ? ఎక్కడ? చెప్పండి సార్! ఆ తేలు యిప్పుడెక్కడుంది?" అంటూ డాక్టర్ అంగద్ గారు వీరావేశంతో గెంతుతూ తన తోకను అందరూ చూస్తుండగా ఓసారి వెనక్కు పొడవుగా సారించారు.

"అయ్యో అంగద్! ఆ తేలు నా తోకను కాటువేసి చరచరా గోడకున్న బొరియలో దూరి పక్కనున్న జాంబవంతరావు గారి గదిలోకి వెళ్ళిపోయింది. సో... అదిప్పుడు ఆ బొరియలో గానీ జాంబవంతరావు గారి గదిలో గానీ వుండి తీరాలి"

సుగ్రీవరావుగారి గదికీ జాంబవంతరావు గారి గదికీ మధ్యలో ఓ సిమెంట్ గోడ వుంది. ఆ గోడ కింది భాగంలో ఒక సన్నని బొరియ వుంది. ఓ గదిని నీళ్లతో కడిగినప్పుడు... ఆ బొరియ ద్వారా ఆ నీళ్ళ పక్క గదిలోకి వెళ్ళడం కోసం దాన్ని పెట్టారు.

"మిస్టర్ హనుమంతూ! యిలా రావోయ్" అంటూ అంజనా దేవి గారు అలా పిలవడం తోటే ఒకే ఒక్క గంతులో ఆమెని సమీపించాడు హనుమంత. వినయ విధేయతలు ఉట్టిపడే స్టైల్‌లో అంజనాదేవి ముందు నిలబడ్డాడతడు. మూడేళ్ల నుండి ఆమె గైడెన్స్‌లో రీసెర్చి చేస్తున్నాడు మిస్టర్ హనుమంతు.

"హనుమంతూ! అర్జంట్‌గా ప్రొఫెసర్ గారి గదిలోకి వెళ్ళి గోడకున్న ఆ బొరియలో నీ తోకను దూర్చి కాస్త కలియబెట్టు. ఆ తేలు బొరియలో దాగుందో లేక... జాంబవంతరావు గారి గదిలోకి జారుకుందో సులభంగా తెల్సిపోతుంది. కమాన్ క్విక్" అంటూ హనుమంతు వేపు చూస్తూ ఆనతి జారీ చేసింది అంజనాదేవి.

"వాట్ మిస్టర్ హనుమంతూ! ఏమిటింకా ఆలోచిస్తున్నావ్?"

"ఏం లేదు మేడం! తోకలోకి బొరియను దూర్చడమెలా అని ఆలోచిస్తున్నాను" తన నోట్లోంచి వచ్చిన ఆ వాక్యం అసంబద్ధమైందని అతనికి అన్పించలేదు. ఎం.ఎ. చదివిన రోజుల్లో వ్యాకరణం పేపర్లో హనుమంతు యూనివర్శిటి ఫస్ట్.

హనుమంతు తన తోకని ఊపుకుంటూ హడావుడిగా సుగ్రీవరావు గారి గదిలోకి అడుగు పెట్టాడు. అక్కడ గోడకి బొరియ వున్న చోట ఆనుకుని మెల్లగా కూర్చున్నాడతడు.

గుండెలు దడదడా కొట్టుకుంటుండగా మెల్లగా బొరియలోకి తన తోకని పోనిచ్చాడు హనుమంతు.

"లాభం లేదు మేడం! ఆ తేలు ఆ బొరియలో వున్నట్టు లేదు ఉంటే తప్పకుండా అది నాతోకకి తగిలి వుండేదా" అంటూ అంజనాదేవితో అన్నాడు హనుమంతు.

"అయితే యిక సందేహం లేదు. ఆ తేలు జాంబవంతరావు గారి గదిలోకి వెళ్లిపోయి వుంటుంది. పదండి వెదకుదాం" అంగద్ గారు అలా అనగానే వరండాలో వున్న వాళ్లంతా జాంబవంతరావుగారి గదిలోకి గబగబా వెళ్ళారు.

"సార్! సార్! ఆ తేలును చంపెయ్యడానికి నాకో వండర్‌ఫుల్ అయిడియా వచ్చింది సార్" అంటూ తెగ ఆనంద పడిపోతూ జాంబవంతరావు గారి వేపు చూశాడు అంగద్.

"ఏమిటయ్యా అది?"

"చెప్పను సార్! చేసి చూపెడతాను. మీరు చూస్తు వుండండి" అంటూ అంగద్ తన చొక్కా జేబులోంచి అగ్గిపెట్టెని వెలుపలికి తీసి పుల్ల వెలిగించి అందరూ చూస్తుండగా చటుక్కున పుల్లని ఆ కాగితాల మీదికి విసిరేశాడు.

ఆ అగ్గిపుల్లతో అక్కడున్న కాగితాలన్నీ మండుకున్నాయి. మంటలు పైకి లేచాయి.

"ఆ తేలు యిప్పుడు ఆ కాగితాల్లో ఎక్కడ దాగివున్నా మాడిమసై పోతుంది. నీది నిజంగానే వండర్‌ఫుల్ ఐడియా" అంటూ అంగద్ గారి తెలివితేటల్ని గుర్తించినందుకు తార్కాణంగా జాంబవంతరావు తన తోకని అంగద్ తోకతో కలిపి సోపచాలనం చేశాడు.

యింతలో... ఆ గదిలో నిలబడ్డ మంటల వేపు తదేకంగా చూస్తున్న తార కెవ్వుమని అరిచింది. ఆవిడ కేకను విని అందరూ కుమారి తారవేపు అనుమానంగా చూశారు. ఆ మంటలలోంచి తప్పించుకున్న తేలు తారను గానీ కాటువేసిందేమోనని వాళ్ళు అనుకున్నారు. అలాంటిదేం జరగలేదు.

"ఏమిటమ్మా తారా! ఏం జరిగింది?" అంటూ తారవేపు చూశాడు జాంబవంతరావు. ఆయూన గారి గైడెన్స్‌లో కుమారి తార ఆరు నెలల నుండి రీసెర్చి చేస్తోంది.

"సార్ సార్! నిన్న సాయంత్రం కరెక్షన్ కోసం నేను మీ చేతికిచ్చిన నా రీసెర్చి మెటీరియల్ ఫైల్ కూడా అందులో తగలబడిపోతోంది సార్! ఆరు నెలల నా శ్రమ బూడిదై పోతోంది" అంటూ తన తోకతో నోరు లబలబ బాదుకోసాగింది తార.

"అమ్మాయ్! అనవసరంగా హైరాన పడిపోకు. ఇంతకీ నీ రీసెర్చి టాపిక్ ఏమిటి?" కుమారి తార వేపు ఓదార్పుగా చూస్తూ అడిగాడు జాంబవంతరావు.

"సారంగధరుని కవిత్వంలో సమాసాలు" తన రీసెర్చి టాపిక్ గురించి చెప్పింది తార.

"సరే వదిలేయ్. నీ రీసెర్చి టాపిక్‌ని యివాళ ఛేంజ్ చేస్తున్నాను. నితలుని కవిత్వంలో విభక్తులు. యివాళ నుండి నువ్ యిదే టాపిక్ మీద రీసెర్చి చెయ్యబోతున్నావు"

"ఆ టాపిక్ మీద మన డిపార్ట్‌మెంట్లోనే రెండేళ్ల క్రితం రీసెర్చి జరిగిపోయింది సార్."

"అలాగా? అయితే జానపద సాహిత్యంలో జంగమ దేవర పాటలు, ఈ టాపిక్ మీద రీసెర్చి చెయ్యి" అంటూ అక్కడి కక్కడే జాంబవంతరావు కొత్త టాపిక్ ని సెటిల్ చేశాడు.

"అమ్మో! అయ్యో! చచ్చిపోతున్నాను. విషం తోకలోంచి ఒంట్లోకి పాకి పోతూ వుంది. తోక సలపుతోంది. భరించ లేకుండా వున్నాను" అంటూ ప్రొఫెసర్ సుగ్రీవరావు గాను తన తోకను భుజం మీద వేసుకుని గంతులేస్తూ, ఆ వరండా పక్క నున్న మామిడి చెట్టు కొమ్మ మీదికి ఒక్క గంతేసి ఎగిరి కూర్చున్నారు.

"సార్! అదిమామూలుతేలుకానట్టుంది అగ్గి తేలులా వుంది. అది కరిసేత భలే డేంజర్. యిప్పుడు మన ప్రొఫెసర్ గారిని కరిచింది సెంట్ పర్సెంట్ అదే అయ్యుంటుంది. అందుకే ప్రొఫెసర్ నొప్పితో విల విలలాడిపోతున్నారు" అంజనాదేవి అంది.

"అయితే యిప్పుడేం చేద్దాం చెప్పండి" అంటూ జాంబవంతరావు అందరి వైపు చూశాడు.

"ఒకటి చేద్దాం" అంగద్ అన్నాడు.

"చెప్పు"

"చెప్పను, చేసి చూపెడతాను. చూస్తుండండి" అంటూ అంగద్ తన రూంలోకి వేగంగా వెళ్లిపోయాడు. చెట్టు కొమ్మపై నుంచి సుగ్రీవరావు అప్పుడే కిందికి దిగాడు.

"ఆ తేలు ప్రొఫెసర్ గారి తోక మీద ఎక్కడైతే కరిచిందో అక్కడి వరకు తోకను కోసెయ్యాలి. లేకుంటే ఆ పాయిజన్ తోక ద్వారా ఒంట్లోకి కంప్లీట్‌గా పాకి పోతుంది. అది జరిగితే ప్రొఫెసర్ గారు మనకు దక్కరు" ఓ చాకును చేత్తో పట్టుకుని హడావుడిగా వచ్చిన అంగద్ అందరి వైపు చూసి అలా అన్నాడు.

"అంగద్ గారూ! వండర్ ఫుల్ ఐడియా" అంటూ అంగద్‌తో తోక చాలనం చెయ్యడానికి తన తోకను కాస్త ముందుకు సారించిన అంజనాదేవికి తనది ఆడ తోక అనే సంగతి గుర్తుకు రావడంతో చటుక్కున ఆమె తోకని ముడిచేసింది.

అంగద్ మాటలువిని సుగ్రీవరావు భయంతో పరుగెత్త బోయాడు. కానీ అందరూ కలిసిఆయనను గట్టిగాపట్టుకున్నారు. అంజనాదేవి జాంబవంతరావు లిద్దరూ ప్రొఫెసర్ సుగ్రీవరావు గారి తోకను కదలకుండా అదిమి పట్టుకున్నారు.

అందరూ చూస్తుండగా ఆయన గారి తోకని చాకుతో ఓ మూరెడు కసుక్కున కోసేసి అవతల పారేశాడు అంగద్. గొంతు తెగినట్లు అరిచాడు సుగ్రీవరావు.

ఎన్నో గ్రంథాలకు ముందు మాటల్ని రాసిన తన తోక... ఎన్నో సిద్ధాంత వ్యాసాల్ని పేజి పేజి తిప్పుతూ పరిశీలించిన తన బంగారు తోక... 'ముచ్చు కోతులు... వాని మురిపెములు' అనేకనొక యు.జి.సి ప్రాజెక్టును ఎంతో సమర్థవంతంగా నిర్వహించిన తన తోక...

గతంలో ఎన్నో సెమినార్స్‌కి అటెండ్ అయి పేపర్స్ సబ్‌మిట్ చేసి అధిక మొత్తంలో టి.ఎలనూ, డి.ఎలనూ ఆర్జించి పెట్టిన తన తోక యిక రాదు యిక లేదు. అలా అనుకోగానే సుగ్రీవ రావు గుండె ల్లోంచి దుఃఖం ఉప్పెనలాఉప్పొంగింది.

ఆ గోడకి వేలాడున్న కనక దుర్గాదేవి ఫోటో మీద ఆయన చూపులు పడ్డాయి.

"అమ్మా! నీ దయవల్ల నా తోక యాథాలాపంగా పొడవుగకా వస్తే 'కనక దుర్గ మహిమలు-ప్రభావములు' అనే అంశానికి సంబంధించి మూడు పి.హెచ్‌డీలూ, ఆరు ఎం.ఫిల్‌లూ గైడెన్స్‌లో చేయిస్తాను తల్లీ" అంటూ బెజవాడ కనకదుర్గగాతన మనసులోనే మొక్కుకుని సుగ్రీవరావు అతి కష్టం మీద నిద్రలోకి జారిపోయాడు.

సరిగ్గా అదే రాత్రి... ఎకనమిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ వాలి. అదే డిపార్ట్‌మెంట్ మరో ప్రొఫెసర్ మారుతీ రావు, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఆంజనేయులు వీరు ముగ్గురూ తోకల దాకా తెగి తాగి ఆనందంతో గంతులెయ్యడం మొదలెట్టారు.

తమకు ఆగర్భ శత్రువైన సుగ్రీవరావు తోక కొంత తెగిపోయిందని, పుత్తూరు శల్య వైద్య శాలకు తీసుకుపోయినా ఆ తోక యిక అటాచ్ కాదని తెలిసి వాళ్ళు ముగ్గురూ మందు పార్టీలో మునిగి పోయారు. అదే పనిగా వాళ్ళ తోకల్ని తిప్పసాగారు.

తన భార్య... మరుసటి ఉదయం టేబుల్ మీద పెట్టి వెళ్ళిన బెడ్ కాఫీ కప్పును అందుకోవడం కోసం అలవాటుగా సుగ్రీవరావు బెడ్‌మీద పడుకుని తన తోకని పైకెత్తాడు. ఆశ్చర్యం! అద్భుతం! తన తోక మొండిగా కాక యధా ప్రకారం పొడవుగా వుంది.

"ఈ దీనుడి మొర ఆలకించావా తల్లీ!" అంటూ కనక దుర్గ ఫోటోను కళ్లకద్దుకున్నాడు సుగ్రీవరావు. అంతే కాదు 'బ్రహ్మ కడిగిన పాదమూ' అనే అన్నమయ్య కీర్తనకు పేరడీగా 'దుర్గ యిచ్చిన వాలమూ' అని పాడుకుంటూ ఓ జంప్ చేశాడాయన.

కనకదుర్గ దయవల్ల తమ ప్రొఫెసర్ గారికితోక యధాలాపంగా వచ్చేసిందని అందరికీ తెలిసిపోయింది. వెంటనే ఆ తెలుగు డిపార్ట్‌మెంట్‌లోని స్టాఫ్ మెంబర్లూ, రీసెర్చి స్కాలర్లూ, ప్రీవియస్ అండ్ ఫైనలియర్ స్టూడెంట్స్ అందరూ తెగ సంబర పడిపోయారు.

ఆ సాయంత్రమే సుగ్రీవరావుకు సన్మానం చెయ్యాలని నిర్ణయించుకున్నారు.

"'మిత్రులారా?' వానరములు, వాని కిచకిచలు' అనే టాపిక్ మీద మన అంగద్ గారు రచించిన గ్రంథానికి అకాడమీ అవార్డు వచ్చినప్పుడు మనం అంగద్ గారిని సన్మానించాం. జాంబవంతరావు గారి పెరట్లోని జామచెట్టు మొదటి సరాగా కాంతకాసిన సందర్భంలో జాంబంతరావు గార్నీ మనం సన్మానించడం మీకు తెలుసు. అదే విధంగా అంజనా దేవి గారి పశువుల కొట్టంలోని ఆవు రెండో పర్యాయం కూడా కోడె దూడను ఈనినప్పుడు... అంజనాదేవి గార్ని మనం సన్మానించడం అదీ మీకు తెలిసిందే. యింత చేసిన మనం... యిప్పుడు మన ప్రొఫెసర్ గారి తోక పునర్జన్మ ఎత్తిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని మనం ప్రొఫెసర్ గారికి సన్మానం చెయ్యక పోతే బావుండదు. అది తెలుగు సాహిత్య చరిత్రకే మచ్చ అని మీ అందరికీ మనవి చేస్తున్నాను" అన్నాడు హనుమంతు.

"రీసెర్చి స్కాలర్ హనుమంతు అలా మాట్లాడగానే మిగిలిన వాళ్లంతా తమ తోకలతో బల్లలను దబ దబా బాది సారెసమ్మా హర్షం ప్రకటించారు. మరో రీసెర్చి స్కాలర్ మిస్ తార కిచ కిచ లాడుతూ పళ్లు యికిలిస్తూ లేచి నిలబడి, ఈ ఫంక్షన్ ఖర్చు నిమిత్తం తన వంతుగా యిరవై రూపాయల్ని తన తోకతో హనుమంతుకు అందించింది.

కొందరు యిష్టంగానే, మరి కొందరు అయిష్టంగానే, యింకొందరు యిష్టా యిష్టంగానే కొంత కొంత డబ్బు యిచ్చారు. ఆ సాయంత్రం 'గంధ మాదనా ఆడిటోరియం' లో సుగ్రీవరావు గారికి ఘనంగా సన్మానం ఏర్పాటు చెయ్యబడింది. ఆ విషయం విన్న ఎకనమిక్స్ ప్రొఫెసర్ వాలి... తోకతో తన గుండెల్ని బాదుకున్నాడు.

హనుమంతు వేదిక మీద మైక్ ముందు నిలబడి... తన తోకతో మైకుని ఫిక్స్ చేసి "ఈ సన్మాన సభకు అధ్యక్షత వహించడానికి వేదిక పైకొచ్చి తమ ఆసనాన్ని అలంకరించవలసిందిగా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ వాయునందన్‌గారిని కోరుకుంటున్నాను" అన్నాడు.

హనుమంతు అలా అనగానే వేదిక ముందు... ముందు వరుసలో కూర్చున్న వైస్ చాన్సలర్ వాయునందన్ గారు ఒకే సారి పల్టీ వేసి ఎగిరి వేదికపై నిలబడి... తన తోక నెత్తి ఆడియన్స్‌కి విష్ చేసి తన సీట్లో కూర్చున్నాడు. సన్మానం సవ్యంగా గడిచింది. ఆ శుభ సందర్భంలో తన అభిమానులంతా కలిసి తనకు బహూకరించిన గదను తీసి భుజం మీద పెట్టుకుని సుగ్రీవరావు ఠీవిగా నిలబడడంతో సభ ముగిసింది.